క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



దెందులూరు నియోజకవర్గ నూతన కమిటీ

దెందులూరు: దెందులూరు నియోజకవర్గం ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఎన్నిక ఆదివారం ఏలూరులో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా చుక్కా అవినాష్‌రాజు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎస్ఎస్ రాజు, సెక్రటరీగా తంబి, కోశాధికారిగా జయరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎంటీఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని నాగశ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు పున్నం బుల్లాబ్బాయ్ తదితరులు ఉన్నారు.

నేడు సెయింట్ జాన్స్ విద్యాసంస్థల రజతోత్సవం



సోమవరప్పాడులోని సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాల

దెందులూరు: సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల రజతోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్టు ఏలూరు పీఠం వికార్ జనరల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. డీఈడీ, బీఈడీ విద్యా సంస్థలను దివంగత ఏలూరు పీఠాధిపతి జాన్ ములగాడ ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల పట్టాలు పొందిన విద్యార్థులకు రజతోత్సవ వేడుకలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, 35 మందికి స్నాతకోత్సవంలో పట్టాలను ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అందిస్తారన్నారు. కళాశాల ప్రారంభం నుంచి విద్యనభ్యసించిన విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారని వివరించారు.

రంగమ్మ చెరువు అన్యాక్రాంతం



రంగమ్మ చెరవు ఆనుకుని ఆక్రమిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: కైకరంలో తోటబడి సమీపంలో ఉన్న రంగమ్మ చెరువు గట్టు ఆక్రమణలకు గురవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువు గట్టు స్థలాన్ని కొందరు యథేచ్ఛగా ఆక్రమిస్తుండటంతో గతంలో దీనిపై ఘర్షణలు సైతం చోటుచేసుకున్నాయి. ఇటీవల ఇదేవిధంగా చెరువు గట్టు స్థలాన్ని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా, గ్రామస్తులు వారితో వాగ్వివాదానికి దిగారు. పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకునే వరకు పరిస్థితి వెళ్లింది. గత రెండు రోజుల క్రితం చెరువు ఆక్రమించుకున్న తహసీల్దార్ శేఖర్ దృష్టికి రాగా, ఆయన వీఆర్వోను పంపి పరిస్థితిపై అప్రమత్తం చేశారు. చెరువు గట్టు ఆక్రమణల వెనుక పెద్దల హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



వట్లూరు గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న చెల్లెం ఆనంద ప్రకాష్

పెదపాడు: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ డైరెక్టరు చెల్లెం ఆనంద ప్రకాష్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సౌకర్యాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాగా చదివేవారు ఉంటారని, వారిని మిగతా వారు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్‌వీడీవీ ప్రసాదరావు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్ వీఆర్వో రాంబాబు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కోట్లమ్మ జాతర

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామ దేవత కోట్లమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. ఈనెల 21 న ప్రారంభమైన ఈ జాతర మహోత్సవంలో ఆఖరి రోజైన ఆదివారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఏలూరు ఏలూరు ఎంపీ పుట్టామహేష్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయలు, కూటమి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచి రందే రాజు వారికి స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాకప్పి ఎంపీని సత్కరించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



కఠిన చట్టాలు రూపొందించాలి



వైద్యులు, వైద్యశాలలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బాగా నష్టం జరిగినప్పుడు, ఎవరైనా చనిపోయినప్పుడు వారం రోజులు నిరసన, కొవ్వొత్తులతో ర్యాలీ, సమ్మెలు చేయడం తదనంతరం మరిచిపోవడం నిత్యకృత్యమవుతోంది. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు, హత్యలు, దౌర్జన్యాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు రూపొందించాలి. వాటిని కచ్చితంగా అమలు చేయాలి.

– కె.విజయభాస్కర్, కంటి వైద్యుడు, దెందులూరు సీహెచ్‌సీ

దాడులు చేయడం సరికాదు



వైద్యరంగంపై దురభిప్రాయాన్ని విడనాడాలి. వైద్యులను హత్య చేయడం, అవమానపరచడం, వైద్యశాలలపై దాడులు చేయడం సరికాదు. ఇటువంటి దుశ్చర్యల వల్ల వైద్యులు, వైద్య సిబ్బందికి అభద్రతాభావం ఏర్పడి ఆ ప్రభావం వైద్యసేవలపై పడుతుంది. వైద్యులు, వైద్యసిబ్బందికి మనస్సులో అభద్రతా భావం ఉంటే సంతృప్తికరమైన వైద్యసేవలు ఎలా అందిస్తారు. వైద్యులకు ప్రభుత్వం భద్రత కల్పించాలి.

– పి.వాసు, మెడికల్ షాపు యజమాని, కూచింపూడి

ఇంతింతై.. గోతులంతై

- మండలంలో మరింత అధ్వానస్థితికి రోడ్లు
- వర్షం వస్తే గొయ్యో రోడ్డో అర్థం కాని స్థితి
- ఆదమరిచి వాహనం నడిపితే అంతే సంగతి
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలు



భీమడోలు – కోమటికుంట రోడ్డులో వర్షపు నీటితో నిండిన భారీ గోతులు

భీమడోలు: మండలంలో రోడ్లు ప్రస్తుత వర్షాలతో భారీ గోతులతో మరింత అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దీంతో రాకపోకలకు అనువుగా లేక అవస్థలు పడుతుండటంతో ఈ గోతులను పూడ్చండి మహాప్రభో అంటూ మండల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారిలో రోడ్లలో భారీ గోతులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా మారాయి. రోడ్లపై వెళ్లాలంటే ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న ఈ రోడ్లు ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత ఛిద్రంగా మారాయి. దీంతో కిలోమీటర్ల దూరం రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు నరక యాతనను అనుభవిస్తున్నారు. భయానక గోతుల్లో సంబంధిత అధికారులు కనీసం మట్టిని వేసి పూడ్చకపోవడంతో ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలు తీసుకుని వెళ్లినా పట్టించుకునే పరిస్థితి లేదు. విసుగు చెందిన గ్రామస్తులు ఆ గోతులను స్వచ్ఛందంగా పూడ్చుకోవాలని నిర్ణయించారు. కొన్ని చోట్ల ఇంటి నిర్మాణాల్లో నిరుపయోగకరంగా ఉన్న మెటీరియల్ వేసి గోతులను పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. భీమడోలు జంక్షన్‌లోని రూపక దేవాలయం వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో వాహనచోదకులు పడి క్షతగాత్రులవుతున్నారు. కొన్ని నెలల క్రితం ఓ వ్యక్తి ఇక్కడి గొయ్యిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం ఈ భారీ గోతుల్లో భవనాల రద్దు మెటీరియల్‌ను వేస్తున్నారు. భీమడోలు బస్టాండ్ రోడ్డు మరింత దారుణంగా మారింది. 50 గ్రామాలకు చెందిన ప్రయాణికులు వందలాది మంది ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు రోడ్డుపై అడుగుకో గొయ్యి చందంగా మారింది. అలాగే గుండుగొలను హైవే వద్ద బెయిలీ వంతెన వద్ద గోతులను పూడ్చకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కనీసం గోతులను పూడ్చే వారే కరువయ్యారు. దీంతో ఇక్కడ గ్రావెల్‌తో గోతులు పూడ్చేందుకు విరాళాలు సేకరిస్తున్నారు. భీమడోలు – కోమటికుంట రోడ్డు కూడా గోతులమయంగా మారింది. వర్షం వస్తే ఆ రోడ్డులో వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. గుండుగొలను నుంచి భోగాపురం రోడ్డు, ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం రోడ్ల పరిస్థితి అంతే. ప్రభుత్వం స్పందించి గోతులను పూడ్పించి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భీమడోలు బస్టాండ్‌లోని రోడ్డు దుస్థితి



గుండుగొలను బెయిలీ బ్రిడ్జి వద్ద భారీ గోతుల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



భీమడోలు రాజులవీధిలో రోడ్డుపై గోతుల్లో వర్షం నీరు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌కు ఘన సత్కారం



వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా నూతన అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావును సత్కరిస్తున్న తేరా ఆనంద్, పారపాటి ప్రభుదేవ

దెందులూరు: ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావును ఆయన నివాసంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, మాదేపల్లి సర్పంచ్ పారపాటి ప్రభుదేవ, జిల్లా కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వారి వెంట యువనాయకులు దేవదాసి ప్రేమ్‌బాబు, తేరా దినేష్, తేరా అఖిల్ ఉన్నారు.

3వ తేదీ వరకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా

దెందులూరు: 132 కేవీ భీమడోలు, భీమడోలు–ఏలూరు ఫీడర్ ప్రస్తుతం కండక్టర్ మార్పు చేయడం కారణంగా ఆదివారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. విద్యుత్ కేంద్రం పరిధిలోని రామారావుగూడెం, దెందులూరు, పూళ్ల, సూరప్పగూడెం, గుండుగొలనుకు చెందిన వ్యవసాయ శాఖకు సంబంధించి సహకరించాలని ఆయన కోరారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు



సోమవరప్పాడు సెయింట్ జాన్స్ కళాశాలలో ఉపాధ్యాయుల సమ్మేళనం

దెందులూరు: సమష్టి కృషితోనే నిరంతర సాధనతోడైతే నూరు శాతం సత్ఫలితాలు లభిస్తాయని ఏలూరు పీఠం సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేలు, సెయింట్ జాన్స్ కళాశాల వ్యవస్థాపక కరస్పాండెంట్ ఫాదర్ జీజే చార్లెస్ అన్నారు. ఆదివారం సెయింట్ జాన్స్ విద్యా సంస్థలో ఉపాధ్యాయుల సమ్మేళనం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అధ్యక్షతన నిర్వహించారు. ఫాదర్ బాల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో 25 ఏళ్ల క్రితం దివంగత ఏలూరు పీఠాధిపతి జాన్ ములగాడ ఆశీస్సులతో ఫాదర్ జీజే చార్లెస్, ఉపాధ్యాయులు అందించిన కృషి, సేవలు నేడు రాష్ట్రం నలుమూలల ఎంతో ప్రయోజకులుగా ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు. 25 ఏళ్ల తరువాత అప్పటి నుంచి ఇప్పటి వరకు పనిచేసిన ఉపాధ్యాయులు కళాశాలలో అపూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనంలో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. తొలుత కళాశాలలో దివంగతులైన గురువులు, విద్యార్థులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రత్యేక దివ్య బలిపూజ నిర్వహించారు. వ్యవస్థాపక కరస్పాండెంట్ ఫాదర్ చార్లెస్, ఫాదర్ ఇమ్మానియేలు, జేఎంజే పాఠశాల కరస్పాండెంట్ సునీతను ఫాదర్ బాలను అధ్యాపకులు సన్మానించారు. సేవలందించిన ఉపాధ్యాయులను ఫాదర్ బాల, ఫాదర్ మైఖేల్, ఫాదర్ జోజిరెడ్డి సత్కరించారు.

వందేభారత్‌కు భీమడోలులో హాల్ట్ ఇవ్వాలి



ఏలూరులో రైల్వే అధికారులకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

భీమడోలు: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని కోరుతూ ఏలూరులో ఆదివారం రాత్రి రైల్వే ఉన్నతాధికారులకు వినపత్రాన్ని అందించారు. ఏలూరులో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ ఇవ్వడంతో హాజరైన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, రైల్వే డీఆర్‌ఎం, ఇతర అధికారులకు భీమడోలు రైల్వే స్టేషన్‌కు వసతులు కల్పించాలని, గతంలో రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌లను ఇవ్వాలని లిఖితపూర్వక పత్రాన్ని జిల్లా బీజేపీ దళితమోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాస శాస్త్రి, ఇతర నాయకులు అందించారు. విజయవాడ నుంచి వైజాగ్, విజయవాడ నుంచి రాజమండ్రి తదితర ట్రైన్లను నిలుపుదల చేయాలని కోరారు. బీజేపీ నాయకులు ఎస్.భాస్కరకృష్ణ ప్రసాద్, నాగం శివ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

భీమడోలులో 'చదవడం మాకిష్టం'



భీమడోలులో చిన్నారులకు జనరల్ నాలెడ్జ్ అంశాలను చెబుతున్న మండే సుధాకర్

భీమడోలు: గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన నిలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. విద్యార్థులు సామూహిక పుస్తక పఠనం చేశారు. చిన్నారులకు జీకే, లెక్కలు సబ్జెక్టులలో మెలకువలపై అవగాహన కల్పించారు. నీతి కథలను వివరించారు. ఈ సందర్భంగా మండే సుధాకర్ మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ప్రతి విద్యార్థి లైబ్రరీని సందర్శించి దినపత్రికలను చదవాలని కోరారు. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, ఎస్.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనం

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు వైజాగ్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆదివారం డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి ఏఐటీయూసీ ప్రతినిధులు సుమారు 500 మంది మూడు రోజుల పాటు సమ్మేళనాల్లో పాల్గొంటారన్నారు. సెప్టెంబరు 3న మధ్యాహ్నం విశాఖనగరంలో మహా కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఈ ప్రదర్శనకు ఏలూరు జిల్లా నుంచి సుమారు 300 మంది ఎంపికైన ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ సాధన ఈఆర్ఎఫ్ లక్ష్యం

దెందులూరు: రాష్ట్రంలో దళితులందరికీ రాజ్యాంగం కల్పించిన ఎస్సీ సబ్‌ప్లాన్ ఫలితాలు అందించడమే ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ (ఏఐడీఆర్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మణి సింగ్ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు రాజ్యాంగబద్ధంగా లభించిన ఎస్సీ సబ్‌ప్లాన్ అమలుకు దాటవేత ధోరణి ప్రదర్శించడం సరికాదన్నారు. ఎఐడీఆర్ఎఫ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించి దళిత హక్కుల దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామన్నారు.

మానవత సేవలు విస్తృతం



సమావేశంలో మాట్లాడుతున్న పుప్పాలగోపి

ఉంగుటూరు: మానవత సేవలు మరింత విస్తృతం చేయాలని మండల మానవత అధ్యక్షుడు వేగేశ్నరంగరాజు అన్నారు. ఉంగుటూరు మండలం మానవత సర్వసభ్య సమావేశం ఆదివారం నారాయణపురంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండల మానవత అధ్యక్షుడు వేగేశ్నరంగరాజు అధ్యక్షత వహించారు. కైకరానికి చెందిన రషీత్‌మణిరామ్‌కి వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సాయం అందజేయాలని సమావేశంలో తీర్మానించారు. మానవత కన్వీనర్ అడపా శ్రీను, కార్యదర్శి గంజి రవి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పుత్సకాయల విష్ణుమూర్తి, శీతాల, వేగేశ్న సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

గుండుగొలను వంతెన పనుల పరిశీలన

భీమడోలు: జాతీయ రహదారి పక్కన గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఆదివారం మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుతో కలిసి ఆయన పరిశీలించారు. బ్రిటిష్ కాలం నాటి వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇక్కడ కాలువపై వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో కొన్ని రోజులుగా పనులు నత్తనడక సాగుతుండటాన్ని గుర్తించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, పెద్దలు పుప్పాల హరీష్ పాల్గొన్నారు.

ఏలూరు నగర బ్రాహ్మణ జేఏసీ సమావేశం

ఏలూరు టౌన్: ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి సమావేశం నగరంలోని ఆర్ఆర్‌పేట మార్కండేయ వేద పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జేఏసీ గౌరవాధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. జేఏసీలోని సంఘాలకు పలువురు నేతలను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి నగరంలోని 8 సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఏలూరు అర్చక సమాఖ్య అధ్యక్షుడిగా కందుకూరి రవికుమార్ శర్మ, కార్యదర్శిగా సావిత్రి భూదేవ సంఘం నుంచి చాట్రాతి మదన్‌మోహన్, కోశాధికారిగా హేలాపురి ఆర్యసేవా సమితి నుంచి భోగరాజు శ్రీనివాస ఫణిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హేలాపురి బ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలిగా కొంపల్లి తాయారును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు



భోగాపురంలో శానిటేషన్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

భీమడోలు: గుండుగొలను, భోగాపురం గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం, మంచినీటి సమస్యల నేపథ్యంలో ఇంటింటా ప్రజలు సీజనల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ఎక్కువగా శివారు కాలనీల్లో నివాసముండే ప్రజలు ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇంట్లో ఒకరి తర్వాత మరొకరిని జ్వరాలు వేధిస్తున్నాయి. గుండుగొలను పంచాయతీ శివారు భోగాపురం గ్రామంలో జ్వరాలు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే విష జ్వరాలతో ఏలూరులో చికిత్స పొందుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పీహెచ్‌సీ దూరంగా ఉండడంతో గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది తప్ప వైద్య బృందం పర్యటించలేదని వాపోతున్నారు. అయితే ఆనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి చెప్పారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నామని ఆమె తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది ముమ్మరంగా చేపడుతున్నారని ఈవోఆర్‌డీ ఏ.సుందరి తెలిపారు.

ప్రతిభను వెలికితీసేందుకే స్పోర్ట్స్ మీట్



గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాలలో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ప్రముఖులు

దెందులూరు: వ్యాయామ విద్యా శిక్షణ అధ్యాపకుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రాజెక్టు స్పోర్ట్స్ మీట్ ప్రధాన లక్ష్యమని దెందులూరు మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు అన్నారు. ఆదివారం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలను ప్రాజెక్టు స్పోర్ట్స్ మీట్, వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ నత్తానియేలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల దేశ వ్యాప్తంగా గుర్తింపు గల క్రమశిక్షణ గల కళాశాల అన్నారు. శిక్షణ పొందుతున్న అధ్యాపకులు ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు నిరంతర సాధన, క్రమశిక్షణతోనే సాధ్యపడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులుగా స్థిరపడిన తరువాత అమలు చేస్తూ మంచిపేరు పొందాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాల్లో విజేతలను ప్రిన్సిపల్ అభినందించారు.

విద్యుత్ స్మార్ట్ మీటరు ప్రక్రియ రద్దు చేయాలి

దెందులూరు: రాష్ట్రంలో వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలుపుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపేర్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్‌మీటర్ల ప్రక్రియ రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేయకుండా విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ కొనసాగించడానికి చర్యలు చేపడుతున్నట్టు ప్రస్తుత సంఘటనలు అద్దం పడుతున్నాయన్నారు. కూటమి నాయకులు గతంలో వ్యతిరేకించిన స్మార్ట్ మీటర్ల ప్రక్రియను నేడు కొనసాగించడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. పండించిన పంటకు దిగుబడి లేదని, ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగాయన్నారు. రైతుల సాయం కూటమి ప్రభుత్వం ఇవ్వకపోవడం, కూటమి ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అన్ని రకాలుగా రైతులు నష్టపోయి ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉంటే వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల ప్రక్రియను ముందుకు తేవడం రైతులను, సంఘాలను రెచ్చగొట్టడమేన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే వెంటనే ఉపసంహరించుకోకపోతే రైతులు, ప్రజలు, సంఘాలు, కార్మికులు పోరాటాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు.

ఘనంగా బీరయ్యదేవునికి గ్రామోత్సవం

పెదపాడు: కొత్తూరు గ్రామంలో బీరయ్యదేవుని పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఈ పండుగను కురమ సామాజికవర్గ ప్రజలు ఎంతో వేడుకగా నిర్వహిస్తారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం సర్పంచ్ కడిమి పద్మావతి గోవిందరావు నివాసం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలను ఊరేగింపుగా తీసుకువెళ్లి బీరయ్యదేవునికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని ఆదుకున్న రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది

ఏలూరు టౌన్: జాతీయ రహదారి–16పై ఏలూరు సమీపంలోని దుగ్గిరాల గ్రామం వద్ద ఒక వ్యక్తి దెబ్బలతో పడి ఉన్నాడనే సమాచారంతో పోలీస్ రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది వెంటనే స్పందించారు. గాయాలతో ఉన్న వ్యక్తిని వెంటనే ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలియగానే మొబైల్ బృందం ఏఎస్ఐ మూర్తి తన సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీస్ సిబ్బంది వెంటనే స్పందిస్తూ భిక్షాటన చేసుకునే వ్యక్తిని ఆపద నుంచి రక్షించటంపై ప్రజలు అభినందిస్తున్నారు.